# డబుల్ ధమాకా...!

-జి.పద్మావతి

"నీ ముందు వజ్రాన్ని, బంగారాన్ని పెడితే ఏం తీసుకుంటావు?" చక్రవర్తి సడెన్‌గా అడిగేసరికి క్యారియర్ తింటున్న నాకు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైంది.

"అంత అదృష్టమా చక్రీ... పెట్టి చూడు రెండూ తీసుకుంటాను" ఆనందంగా అన్నాను.

"లేదురా... ఒక్కటే ఆప్షన్... ఏం తీసుకుంటావో చెప్పు" క్యారియర్ ఓపెన్ చేస్తూ అడిగాడు.

"వజ్రం ఎప్పటికీ నిలిచే వుంటుంది కదా. అదే తీసుకుంటాను"

"కదా... ఎవ్వరైనా అంతేకదా. కానీ వజ్రాలని తీసుకుంటే అది నా చేతికి వచ్చేసరికి రాయిగా మారిపోతుందిరా" కాస్త బాధగా అన్నాడు.

"అదేమిటి...నాకిస్తానని నువ్వెందుకు తీసుకుంటావు?" సరదాగా కాస్త గట్టిగానే అన్నాను.

"అరేయ్... ఇవ్వడంకాదు. నీ అభిప్రాయం అడిగాను."

"నీకేమన్నా అతీత శక్తులున్నాయేమో రాయి పట్టుకో వజ్రంలా మారిపోతుంది"

"నా బాధ వినిపించుకుని ఏదైనా మార్గం ఉంటే చెబుతావని, మన చానాళ్ల స్నేహంమీద నమ్మకంత వచ్చాను" అన్నాడు.

"చక్రీ! ఇవాళ పవర్‌కట్‌వల్ల టీవీ చూడకుండా మా ఆవిడ గుత్తివంకాయ కూర బాగా చేసింది. హాయిగా తిననివ్వు" అన్నాను.

"తింటూనే వినరా నాయనా.. నా బుర్ర బద్దలైపోతోంది. శ్రద్ధగా విను. నీకు తెలియనిది చాలా చెబుతాను"

"వినకుంటే నా తల వ్రక్కలైపోతుందా? వ్రత కథల్లాగా పూర్తిగా వింటే పుణ్యం అన్నమాట" నవ్వుతూ అన్నాను.

లేచి వెళ్లిపోబోయాడు.

"సరే...సరే చెప్పు" అంటూ కూర్చోబెట్టాను.

"నేను బాగా చిన్నగా ఉండగా..."

"అందరూ చిన్నగా ఉండే పెద్దయ్యేది. చిన్నప్పుడు అనాలి. సరే చెప్పు" అన్నాను వాడ్ని చూడలేక.

"దేవుడు అన్నీ డబుల్ ధమాకాలే ఇస్తుండేవాడు. ఎటూ తేల్చుకోలేనంతగా... భేదాలు విభజించుకుని ఏది బావుంటుంది అని ఆలోచించి చేసినా ప్లాన్ పాడై పోతుంది."

"అంటే మన చిన్నప్పుడు తెలుగు మీడియం స్కూలో చదివేటప్పుడు జంతువులు, మొక్కలు, పల్లెలు, పట్టణాలు అని విభజించి భేదాలు రాసాం. అలాగేనన్నమాట" చేయి తుడుచుకుంటూ అన్నాను.

"అవునంతే. నాలుగేళ్లప్పుడు మా బాబాయికి పిల్లలు పుట్టలేదని నన్ను దత్తత తీసుకుంటామన్నారు (ట). మా అమ్మ వాడేం చిన్నపిల్లాడు కాదుకదా అడుగుదాం అని నన్నడిగి 'దత్తత అంటే వాళ్లింటి వెళ్లిపోవడం' అని చెప్పింది."

"బాబాయికి అప్పటికే టీవీ, పెద్ద ఊయల, పెద్ద బండి, నౌకర్లు... అబ్బో... అనుకుని అమ్మకి ఆ ఇంటికి భేదాలు రాసుకుని ఒప్పుకున్నాను. నేను వెళ్లాక పిన్నికి ఇద్దరు పిల్లలు పుట్టారు. ఖర్చు పెరిగి లగ్జరీలన్నీ తగ్గించేసారు. అక్కడేమో నాన్నకి వ్యాపారం బాగా కలిసొచ్చి లక్షలు సంపాదించాడు. తమ్ముడికి బోలెడు ఆస్తి. నాకు హక్కు లేదని చిన్నప్పుడే రాసేసానట. ఇక్కడ మూడువాటాలు అయింది. నాకు అప్పుడు అనిపించింది అనవసరంగా దత్తత ఎందుకొచ్చానా అని. అలా నాకు రావాల్సిన అలా ఆస్తి అటకెక్కింది."

'డబుల్ ధమాకా నువ్వే పోగొట్టేసుకున్నావన్నమాట" అన్నాను.

"అవునురా... తరువాత చదువు. ఎక్కడో ఇంజనీరింగ్‌లో జాయిన్ చేసారు. నాకేమో ఆ వాతావరణం అస్సలు నచ్చలేదంటే నమ్ము. ఆ రాళ్లు, రొట్టెలు తినలేక మన ఇడ్లీ పెసరట్లు మీద దిగులు వచ్చి చదివేది ఏదైతే ఏంటని వదిలేసి ఇక్కడ డిగ్రీలో జాయినయ్యాను. కంప్యూటర్ యుగం కదా. ఇంజనీర్లు అందరూ అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించారు. కోటీశ్వరులు అయిపోయారు."

"భేదాలు రాసుకోలేదా? ఏది వజ్రమో తేల్చుకోలేకపోయావా?" కాస్త బాధగానే అన్నాను.

"పొరుగు రాష్ట్రంలో పరుగెత్తి పాలు తాగే కన్నా మన స్టేట్‌లో నిలబడి నీళ్లు తాగుదామని వచ్చేసాను. ఏదో గుడ్డిలో మెల్ల అన్నట్లు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఆస్తి కూడా ఉందని పెళ్లి సంబంధాలు కూడా బాగా వచ్చాయి."

"అవునవును. ఒక సంబంధం చూడ్డానికి నేనూ వచ్చానుగా" అన్నాను.

"అది మానేసాను. అమ్మవేపు మామయ్య కూతురు. ఇంకో అమ్మవేపు మామయ్య కూతురు... బయట నుండి మూడు వచ్చాయి. ఐదు భేదాలు రాసుకోవాలన్నమాట. కష్టమే... ఆప్షన్ ఎంచుకోవడం"

"కదా... అయినా పెద్దాళ్లమీద కొంచెం భారం వేసాను. రెండు చదువు తక్కువని వదిలేసాను. నాన్నవేపు అత్తకూతురు పెద్ద చదువు చదవిందని వద్దన్నాను మాట వినదని"

"ఏ నాన్నా?... అర్థం కాలేదు" వక్కపొడి వేసుకుంటూ అడిగాను.

"ష్... నెమ్మదిగా మాట్లాడు. ఎవ్వరైనా వింటే వేరే అర్థం వస్తుంది" చుట్టూ చూస్తూ అన్నాడు.

ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా ఉన్నారు. ఒకళ్ల మాటలు పట్టించుకునే పరిస్థితుల్లో వాళ్లు లేరు కూడా.

"అసలు నాన్నవేపే..." కొరకొర చూస్తూ చెప్పాడు. "ఇక మిగిలింది రెండే. మధ్య గీత గీసి అమ్మవేపు, పెంచుకున్న అమ్మవేపు అని రాసుకున్నాను. అన్నీ ప్లస్‌లే వచ్చాయి"

"అదేదో సినిమాలోలా ఇద్దర్నీ చేసుకోవాల్సింది."

"సెటైర్లు వేయకు విను. ఆస్తి తెస్తారు, చదువుంది కానీ పల్లెటూరి అమ్మాయి అయితే పనిపాట్లు వస్తాయి. భర్తను బాగా చూసుకుంటుందని మా రెండో అమ్మవేపు సంబంధమే ఖాయం చేయమన్నాను. మావాడు మహా తెలివైనవాడని మా అమ్మ తెగ మురిసిపోయింది. అసలు అమ్మకి కొంచెం కోపం కూడా వచ్చింది. అందుకే ఒకేసారి రెండు పెళ్లిళ్లు ఎంతో ఘనంగా జరిగాయి."

"వీడికిద్దరా?" అనుకుంటూ "రెండూ చేసేసుకున్నావా? ఇంకో ఇల్లెక్కడ, అదేనా ఇప్పుడు ప్రాబ్లం?" ఆశ్చర్యంగా గబగబా ప్రశ్నలేసేసాను.

"నా మొహం పట్నం అమ్మాయిని అసలు తమ్ముడికి ఇచ్చి పెళ్లి చేసేసారు. సారెలూ, పెట్టుబడులూ ఘనంగానే చేసారు నాకు. అక్కడికెళితే



కోడిపందాలు, నేతిగారెలు, పెద్దవాళ్ల వేళాకోళాలు...మహా సందడిగా ఉండేది. పండక్కి నాకు గొలుసూ, బ్రాస్‌లెట్టూ పెట్టారు.''

"మరింకేంరా వజ్రమే సెలెక్ట్ చేసుకున్నావుకదా. వచ్చిన ఇబ్బంది ఏమిటంటే ఇంటి కుక్కకు వేసినట్లు చైన్ వేసారన్నమాట వాళ్ల మాటలు వింటావని'' అన్నాను.

"కాదురా అది రాయే. నేను చాలా పొరపాటు చేసాను. వజ్రం కాదని ఆరునెలలకే అర్థం అయింది. అదృష్టం నాకు లేదురా. పట్నం పిల్లని చేసుకోవాల్సింది అనుకున్నా.''

"ఇన్ని డబుల్ ధమాకాలుంటే అంతేమరి. ఒకే సంబంధం వస్తే భేదాలు పట్టిక రాసుకోంకదా. ఏమైనా యూ ఆర్ వెరీ లక్కీ పర్సన్''

"కాదురా కానేకాదు. చూడు నువ్వే'' అంటూ తినీ తినని క్యారేజీ నావైపు జరిపాడు.

నాలుగు క్యారెట్టు ముక్కలు, బీట్‌రూట్ ముక్కలు, అరకొరగా వేగిన చపాతీలు రెండు...

"మరి అన్నమేది?'' అనడిగాను.

"ఉండదు. షుగర్ వస్తుందని ఆదివారం అన్నం, సోమవారం సోయాచిక్కుడు, మంగళవారం మటన్ కొంచెం... అలా మెనూ ఏర్పాటు చేసేసింది'' ఏడుపు మొహంతో అన్నాడు.

"మరీ ఈ చపాతీ ఏంటి మరీ అట్లాస్ వుంది''

"తనకి వంట చేయడం రాదు. ఇంటి నిండా మనుషులూ, పల్లెటూరిలో పనివాళ్లు బాగా దొరికి పని కూడా అలవాటు కాలేదుట. చపాతీ పిండి కొంచెం నీళ్లల్లో కలిపి పెనం మీద చేత్తో వత్తేసి పొయ్యిమీద పెడుతుంది. 'ఇది పద్ధతి కాదనుకుంటానే ప్రియసఖీ' అంటే "కడుపులో వెళ్లేదానికి షేప్ ఎందుకండీ? అని రెండు పచ్చి ఉల్లిపాయలు కోసి ఇందులో పడేస్తుందిరా.''

"మరిలా లావుగా కోసారేమిటి?'' అటూ ఇటూ తిప్పుతూ అడిగాను.

"కళ్లు మండుతున్నాయని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని మరీ ఉల్లిపాయలు కోస్తుంది. మరలా ఉండక ఎలా ఛస్తాయి'' విసురుగా అన్నాడు. ఏమైనా అన్నాననుకో మావాళ్లు బోలెడు ఆస్తి ఇచ్చారుగా అని దబాయిస్తుంది. నేను పని చేయను అని మొరాయిస్తుంది.''

"మరయితే అన్నీ ఆవిడకి తిరిగి రాసిచ్చేయ్‌రాదూ'' అన్నాను.

"ఎక్కడివి.. అన్నీ అమ్మేసి అదేదో కంపెనీ లాభాల్లో ఉందని షేర్లు కొంటే సత్యప్రమాణంగా భత్యం అయిపోయాయి. అన్నీ పాడు చేసానని ఆవిడకి కోపం.''

నాకు పాపం అనిపించి "ఐరెన్‌లెగ్'' అన్నాను.

"మా తమ్ముడి భార్యకు పెళ్లయ్యాక ఉద్యోగం వచ్చింది. ఇద్దరూ పొద్దునే వంట చేసుకుని కలసి ఆఫీస్‌కి వెళ్లిపోతారు. పని మనుషులు పట్నంలో దొరక్క ఆవిడకి పనిపాట్లు అలవాటట.''

"ఇప్పుడు చెప్పరా వజ్రం అలాగే నిలిచి వుండాలి.. నాకు అన్నీ కలసి రావాలి. పిల్లలు బాగా చదివి ఫారిన్ వెళ్లాలి'' అంటూ పెద్ద కోరికల లిస్టు చదివాడు.

"ఏం చేయను?'' అనడిగాడు.

"ఆఫీసయ్యాక కలుద్దాం'' అని చెప్పి సెలవు తీసుకున్నాను.

★★★

"ఉంగరాలు, మంత్రాలు నీకు పని చేయవుగానీ మొన్న మా ఊళ్లోకి శుష్క మందహాసం పరమపద అసంతృప్త స్వాములవారు వేంచేసారుట. ఆయన మనమీద దయ తలిస్తే క్షణాలలో కోటీశ్వరులమయిపోతామట. పవర్‌కట్ టైంలో మా ఆవిడ పక్కింటావిడతో చెప్తోంది. ఆయన నీలాంటి వాళ్ల ప్రాబ్లం తీర్చడంలో దిట్టట. ఆయన లాగిపెట్టి కొడితే లక్షలు, పొగిడితే ప్రమోషన్... తిడుతూ కొడితే కోట్లు వస్తాయిట''


"మూడోది బాగుంది. అయినా అదేం పేరు అలా వుంది?'' అన్నాడు మధ్యలో నన్ను ఆపేస్తూ.

"నీకు పూర్తిగా రివర్స్‌రా ఆయనా. వద్దనేకొద్దీ డబ్బుల మూటలేనట. చిన్నప్పుడు చదువు వంటికి పట్టక చెట్టూ పుట్టా తిరిగి పిల్లలతో ఫైట్లు అవీ చేసిన అనుభవంతో దేశాటన చేస్తూ 'కొట్టుకో, పళ్లూడగొట్టుకో' అనే ఒక ఆటలో చేరి అవతలి వాడ్ని చితకబాది బాగా డబ్బు సంపాదించాడుట. అదృష్టం జిడ్డులా పట్టుకుని కోట్ల రూపాయలు గడించారుట. ఆనక సినిమాల్లో చేరితే అక్కడా కోట్లు కుమ్మరించారుట. టైమ్‌కే భోజనం, కార్లు, ఏసీలు చూసి విసిగిపోయిన అసంతృప్తితో రోడ్డుమీద నడిచి...''



## యాహూ జెనీలియా

జెనీలియా ఇప్పుడు యాహూ అంటోంది. 'యాహూ' అనే పేరుతో ఓ హిందీ సినిమాలో నటిస్తోందామె. ఇందులో షాహిద్ కపూర్ హీరో. షాహిద్ డాన్స్ చాలా బాగా చేస్తాడు గనక తను అతనికి దీటుగా చేయడానికి కష్టపడాల్సిందే అంటోంది జెనీలియా. ఈ సినిమా తన కెరీర్‌ని తప్పకుండా మలుపు తిప్పుతుంది ఈ 'యాహూ' అని ధీమాగా వుంది జెనీలియా.



"డబ్బు విసిగిస్తుందేమిట్రా... వింత కాకపోతేనూ..." అన్నాడు చక్రవర్తితో మధ్యలో.

"విను. ఆయనకి విసుగేసింది. మనిషికి ఏదీ లేకపోతే అదే కావాలని అనిపిస్తుంది. అందుకు నడిచి వెళ్తుంటే బిచ్చగాడు ఒకడు 'ఆకలవుతోంది, అర్ధ రూపాయి ఇవ్వమన్నాటట. దానికి స్వాములవారు "ఆకలా.. అంటే ఏమిటి? అవడమేమిటి? అది ఎక్కడుంటుంది?" అని అడిగేసరికి వాడు లాగి కొట్టాడుట. ఆ అవమానంతో కొండలూ కోనలూ తిరిగి హిమాలయాల్లో 'అవసరం' అనేదానిమీద రీసెర్చ్ చేసి ఇలా అవతారం ఎత్తారు. ఇప్పుడు ఎవరి అవసరం కోసం వాళ్లు భక్తులుగా ఊరికే ఇస్తున్నారు ఆయనకు కోట్ల డబ్బు" ఆయాసపడుతూ ఆగాను.

"ఎంత అదృష్టం... నువ్వూ రారా నాతోపాటు" అన్నాడు.

"నాకీ జన్మకి అవసరాలేం లేవు. నాకే లోటూ లేదు. నువ్వెళ్లు. ఆయన ఆశీర్వాదం నీకవసరం" అన్నాను.

★★★

పెద్దహాల్లో చివరగా పెద్ద సింహాసనం వేసారు. శిష్యులు హడావుడిగా మైకులు సర్దుతున్నారు.

వందలకొద్దీ జనం టిక్కెట్లు కొనుక్కుని కూర్చున్నారు. పక్కగా నాలాంటి వాళ్లు నలుగురైదుగురు నించున్నారు. ఇంతలో శిష్యులు స్వాగత వచనాలు పలుతుండగా స్వామీజీ వచ్చారు. అందరూ ఒక్కరొక్కరుగా పాదాభివందనం చేసారు.

"ఇప్పుడు స్వామీజీ తిడతారు.. అందరూ సిద్ధంగా ఉండండి" అనౌన్స్ చేసారు శిష్యులు.

"అత్యాశకు పోయేవాళ్లు అనాకారీ అప్రాచ్యులు, అంట్ల వెధవలు, ఆముదం తాగిన మొహాలు, ఇరుకింట్లో ఈతకాయలు ఏరుకునే ఉడత మొహాలు..."అంటూ ఎన్నడూ వినని, ఆ తిట్లు ఏ భాషకు సంబంధించినవో కూడా తెలియని తిట్ల దండకం సాగించారు.

కొందరు కాసేపయ్యాక చెవులు మూసుకున్నారు. వెళ్లిపోయారు కూడా.

తిడుతూనే ఆయన చక్రవర్తి పక్కనున్నతన్ని కొట్టాడు. అంటే లాటరీ ఆయనకు తగిలిందన్నమాట.

ఆ రోజు టిక్కెట్లమీదవచ్చిన సొమ్మంతా అతనికిస్తారు. స్వామీజీ కూడా అరకోటి గ్రాంట్ చేసారు. మావాడు అమాంతం ఆయన కాళ్లమీద పడిపోయాడు.

"తిట్లు కూడా పొగడ్తలా స్వీకరించడం ఎంత కష్టం? అంతకన్నా మించిన కష్టమేమిటి నాయనా? భార్య వండట్లేదా? పిల్లలు చదవడం లేదా?" అనడిగారు సౌమ్యంగా.

నాకు చెప్పినదంతా స్వామివారికి చెప్తున్నాడు చక్రవర్తి. ఆయన ఓపిగ్గా విన్నారు. శుష్కమందహాసమొకటి చేసారు.

"పిల్లల్ని ఎందులో పెట్టను? ఏం చదివించను? నాకు పట్టిందల్లా బంగారం ఎలా అవుతుంది? ఏ వ్రతం చేస్తే కోరికలు తీరుతాయి" అన్న లెవెల్లో అడిగాడు.

"వాళ్లేది చదివితే అదే చదివించు. నీ కాళ్లూ వేళ్లూ వాళ్ల భవిష్యత్తులో పెట్టకుండా ఫ్రీగా వదిలేయ్. అంతా మంచే జరుగుతుంది. ఎక్కువగా ఆశించకుండా దేవుడిచ్చిన డబుల్ ధమాకాలన్నీ సరిగ్గా ఉపయోగించుకో" అన్నారు.

వాడికి తృప్తినివ్వలేదు. ఆయన చెప్పింది అసలు నచ్చలేదు.

"ఈమాత్రానికే ఇన్ని తిట్లు భరించాలా? నా ప్రక్కనాయనకు చూడు ఎంత డబ్బు వచ్చిందో" అన్నాడు.

"నీకుందికదరా. అంతా మన మంచికే అనుకో" అన్నాను.

"ఆయన చెప్పిన థియరీకి అస్సలు అర్థమేలేదు. ఏమీ లేనిదానికి ఇంత బిల్డప్పా?"

"అప్పుడిక్కడకెందుకొచ్చావురా అసంతృప్త శిష్యా..." అంటూ గట్టిగా వినబడింది మైకులో.

"వాడ్ని పట్టుకోండిరా" అన్నారు.

"అమ్మో... ఎలా వినబడిందో" అంటూ ఒక్క పరుగు తీసాడు బండి కూడా తీసుకోకుండా చక్రవర్తి.

నేను కూడా ఫాలో అయ్యాను బైక్ నడుపుకుంటూ.

★

## గిన్నెస్‌కెక్కిన ఆనందిత

2007లో అస్సామ్‌కి చెందిన భూత్‌ఝులోకియా అనే మిర్చి ప్రపంచంలో అత్యధిక కారంగల దానిగా గిన్నెస్ బుక్‌లోకి ఎక్కింది. ఒక్క మిరప గింజని నోట్లో పెట్టుకుంటే నోరు మండిపోవడమే కాకుండా ప్రాణాలు కడబట్టిపోతాయి. అలాంటిది ఇటీవల ఆనందితదత్తా అనే మహిళ రెండు నిముషాల్లో 51 ఝులోకియా మిరపకాయల్ని కలకసా నమిలి మింగివేయడమే కాకుండా వాటిని నలిపి కళ్లల్లో కాటుకలా రాసుకుని గిన్నెస్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. గత సెప్టెంబర్-నవంబర్‌లో ఆ చిల్లీతో చేసిన సాస్ కేవలం టేస్టు చేసి ఇంగ్లండ్, ఆఫ్రికా దేశాల్లో చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్లుండగా ఆనందిత అన్ని మిరపకాయలను తినడం ఎంత సాహసం. ఇంత సాహసం ఎలా చేసారని అడిగితే 'తన ఐదవ ఏట నుంచే ఆ మిరపకాయల్ని తినడం తనకు అలవాటు అయిందని' నవ్వుతూ చెప్పింది.



-తటవర్తి

